
పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్, కందూరి కృష్ణ

పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్ లాల్ ఫౌండేషన్లు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం అని వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం చిక్కడపల్లిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో పేదలకు అల్పాహారం, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం పేదలకు, గ్రూప్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ల చైర్మన్ కందూరి కృష్ణ మాట్లాడుతూ.. ప్రతిరోజూ సుమారు 1500 మందికి అల్పాహారం, పండ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రమోద్ అగర్వాల్, గోవిందరావు, డాక్టర్ సంగీత, కౌశిక్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): జీపీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకులు నాగేందర్‌రావు, జి. శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సంగీత విభావరిలో పలువురు గాయనీగాయకులు పాల్గొని ఏకగళ, యుగళ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు, రజని, అనిత, సుబ్బిరెడ్డి, వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల శ్రమతో సంపద సృష్టి'

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులు నిరంతరం చేస్తున్న శ్రమతోనే సంపద సృష్టించబడుతుందని హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చిక్కడపల్లిలో హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ సంస్థ కార్యాలయంలో 'ఏదీ ప్రగతి' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. వైఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. సమాజ సౌభాగ్యానికి కార్మికుల శ్రమ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. గొర్తి వెంకటలక్ష్మి, లక్ష్మణాచార్యులు, వెంకటలక్ష్మి, ప్రసాద్, సుబ్బలక్ష్మి, అరుణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మలేషియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో

నగర విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన 20వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. జపాన్ షోటోకాన్ అసోసియేషన్, షికో కరాటే డూ సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు పతకాలు సాధించారని కరాటే మాస్టర్ వైఆర్ శివకుమార్ తెలిపారు. కరాటే కటాస్ విభాగంలో 4వ తరగతి చదువుతున్న ఎస్ జైకార్తికేయన్, ఎస్. తమన్, ఏఎస్ఎన్ గౌతమ్ రజత పతకాలు, సీనియర్ కటాస్ విభాగంలో శివకుమార్‌కు స్వర్ణపతకం లభించిందన్నారు. కుమిట్ విభాగంలో ఎస్ జైకార్తికేయన్ రజత పతకం, ఏఎస్ఎన్ గౌతమ్, ఎస్. తమన్ కాంస్య పతకం సాధించారని తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులను సోమవారం పలువురు అభినందించారు.


మాట్లాడుతున్న సోషల్ సర్వీస్ లీగ్ ప్రధాన కార్యదర్శి అజయ్‌గౌతమ్

రేపు భాగ్యరెడ్డి వర్మ జయంతి

బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): దళితజన వైతాళికుడు, సంఘ సంస్కర్త మాదరి భాగ్యరెడ్డివర్మ 136వ జయంతి ఈ నెల 22న నిర్వహిస్తున్నామని ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ వెల్లడించింది. సోమవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో లీగ్ అధ్యక్షుడు రాహుల్ ఆమ్‌లోక్‌శాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఎం.అజయ్‌గౌతమ్, మేనేజింగ్ ట్రస్టీ జీఎస్. జ్ఞానప్రకాష్, ఉపాధ్యక్షుడు డి. బాలనర్సింహ మాట్లాడారు. భాగ్యరెడ్డివర్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 22వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, గౌరవ అతిథులుగా సీనియర్ పాత్రికేయులు సతీష్ చందర్, ప్రముఖకవి, గాయకుడు జయరాజ్, అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇ. సుధారాణి, ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, గనుముల జ్ఞానేశ్వర్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తారని వారు తెలిపారు.

దివ్యాంగుల సేవలో 'నాట్స్'

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సేవలో నార్త్ అమెరికా తెలుగు సంఘం(నాట్స్) ముందుంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు నూతి బాపయ్య (బాపు)చౌదరి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానసిక దివ్యాంగులకు వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమాన్ని సోమవారం త్యాగరాయగానసభలో ప్రారంభించారు. నాట్స్ స్పర్శ్, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సేవలు అందించేందుకు నూతనంగా కొనుగోలు చేసిన వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు ఫిజియోథెరపీ, ఆక్యుప్రెషర్‌థెరపీ, టీచింగ్ మెటీరియల్ ద్వారా చికిత్స అందిస్తామన్నారు. నాట్స్ కో-ఆర్డినేటర్ రవితాండ్ర, దివ్యాంగుల హక్కులవేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, స్పర్శ్ ప్రతినిధి పంచముఖి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపయ్యచౌదరిని సేవారత్న పురస్కారంతో సత్కరించారు.

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా

28న గ్రేటర్‌లో సేవా కార్యక్రమాలు

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా ఈనెల 28న గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా తెలిపారు. సోమవారం దోమలగూడలో నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరిగే కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, టీడీపీ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. టీడీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రులలో పండ్లు, మహిళలకు చీరల పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు పరుశురామ్, ఎస్. ప్రకాష్, భానుప్రకాష్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

పూడుకుపోతున్న నాలాలు


హుస్సేన్‌సాగర్ పరీవాహక మూసీ నాలాలో గాంధీనగర్ బ్రిడ్జి వద్ద పూడిక తీసి నాలాలోనే పక్కన పడేసిన మట్టి, చెత్తాచెదారం


బాగ్‌లింగంపల్లి వద్ద హుస్సేన్‌సాగర్ నాలాలో చెత్తా చెదారం


చెట్లు, మట్టి, చెత్తాచెదారంతో నిండిన గోల్నాక హర్రాజీపెంట నాలా

అధిక ఫీజులు వసూలు చేస్తున్న

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం పట్టణాల్లో కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తున్నాయన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల లైసెన్స్‌లను రద్దు చేయాలని కోరారు. అధిక ఫీజుల వల్ల పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న 40 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, సకాలంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చూడాలని, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కోరామని ఆయన తెలిపారు.


విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య, నీల వెంకటేష్, గుజ్జ సత్యం తదితరులు

కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, గుజ్జ సత్యం, జి. మల్లేష్‌యాదవ్, రుషికుమార్, నిఖిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల బుర్జుగల్లీ, మహంకాళి ఆలయం వీధి, బతుకమ్మకుంట, కుమ్మరబస్తీ తదితర ప్రాంతాలలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి సోమవారం తొలగింపజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఎఫ్ఐ హరినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

- రాంనగర్ హరినగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ కె. రవిచారి సూచించారు. సోమవారం హరినగర్, బాకారం, దయార మార్కెట్, పవిత్రనగర్‌లో పర్యటించి డ్రైనేజీల సమస్యలను పరిశీలించారు.


బాగ్‌అంబర్‌పేటలో మ్యాన్‌హోల్‌లో మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి


రాంనగర్ హరినగర్‌లో మ్యాన్‌హోల్ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కొనసాగించాలి

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లను కొనసాగించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కొంతమంది స్వార్థపరులు గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు దక్కకుండా హైకోర్టులో పిటిషన్ వేశారని ఆరోపించారు. గిరిజనులకు గతంలో ఉన్న రిజర్వేషన్‌ను కొనసాగించాలని కోర్టు ఆదేశాలిచ్చిందని తెలిపారు. లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ రద్దు చేస్తున్నామని, త్వరలో నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు.

సమావేశంలో సేవాలాల్ సేన కోర్ కమిటీ చైర్మన్ ధారావత్ ప్రేమ్‌చంద్, రాష్ట్ర ఇన్‌చార్జి మాలోతు సైదానాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, రైతు సంఘం అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ రాథోడ్, నగర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూక్యా సంజీవ్‌నాయక్

ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం శ్రీనివాస్ రచనలు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పురాణపండ శ్రీనివాస్ రచనల్లోని అక్షరాలు ఆధ్యాత్మికతకు పట్టాభిషేకం అని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో పురాణపండ శ్రీనివాస్ రచించిన ఉగ్రం వీరం గ్రంథావిష్కరణ సభ సోమవారం సాయంత్రం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది.

పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. నరసింహస్వామి అవతారంలో ఉగ్రరూపం సమాజ శ్రేయస్సు కోసమేనని పురాణపండ వ్యాఖ్యానించారని, సంస్కృత శ్లోకాలతోపాటు తెలుగులో విశ్లేషణ చేశారన్నారు. ఆధ్యాత్మిక సాహిత్యంలో శ్రీనివాస్ బహుగ్రంథకర్త అన్నారు. ఆయన సామాజిక హితం కోసం జీవితకాలం అంతా ఆధ్యాత్మిక సాహితీ సేద్యం చేస్తూ తన సంపదను వెచ్చిస్తున్న మహనీయుడన్నారు. ప్రొఫెసర్ శరత్‌జ్యోత్స్నారాణి మాట్లాడుతూ.. సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి గ్రంథాలు దోహదపడతాయన్నారు. అపర్ణ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

6 నుంచి నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీలకు నగరం వేదిక కానుంది. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో జరిగే ఈ పోటీల్లో 26 రాష్ట్రాల నుంచి 700 మందికి పైగా క్రీడాకారులు, అధికారులు పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని అన్నారు.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణరాజ్ పుత్, చిత్రా షినాయ్, కోశాధికారి ఎస్‌కే జమీల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈనెల 25న హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీలో పురుషులు, మహిళల రాష్ట్ర త్రోబాల్ జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అదేరోజు చాంపియన్‌షిప్‌కు సంబంధించిన అధికారిక జెర్సీ, లోగోను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ కార్యనిర్వాహక చైర్మన్ డాక్టర్ సత్యం శ్రీరంగం

ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చాంపియన్‌షిప్ పోటీల కమిటీ చైర్మన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ గాయని ఎస్పీ శైలజకు 'చక్రవర్తి జీవనసాఫల్యం' ప్రదానం

రవీంద్రభారతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ ఎస్పీ శైలజకు సంగీత దర్శకుడు కె.చక్రవర్తి జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రవీంద్రభారతిలో సుస్వర వాహిని సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో స్వరాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజకు పురస్కారం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ నిర్మాత, నటుడు మురళీమోహన్ పురస్కారగ్రహీతను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, అమీన్‌పాషా, పెద్ది సురేష్, నాదప్రియ, గాయత్రి నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది.


ఎస్పీ శైలజను సత్కరిస్తున్న అతిథులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈలు ప్రేమానంద్, విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు దోమలగూడ స్ట్రీట్ నంబర్ 6, 7, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 10 నుంచి 11 గంటల వరకు దోమలగూడ, బాదంగల్లీ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు చిక్కడపల్లి మార్కెట్ తదితర ప్రాంతాల్లో, దత్తానగర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, వైఎంసీఏ పరిధిలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, బసంత్ కాలనీ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఫీవర్ ఆస్పత్రి పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు, నల్లకుంట పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంతం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు పేర్కొన్నారు.

రాంనగర్‌లో జాబ్ మేళా నేడు

ముషీరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. రాంనగర్‌లో ఎస్ఆర్‌డీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని, ప్రముఖ కార్పొరేట్ సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. యువతీ యువకులకు ఉపాధి రంగంలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు కూడా స్వీకరిస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో గల ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం. హనుమాన్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 16 నుంచి ప్రారంభమైందని, ఆసక్తిగల విద్యార్థులు జూన్ 10వ తేదీ లోపు దరఖాస్తులను వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ తెలంగాణ డాట్ జీవోఈ డాట్ ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

25న సైకాలజిస్టులకు శిక్షణ శిబిరం

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): సైకాలజిస్టులు వృత్తినైపుణ్యాలను పెంపొందించేందుకు సైకియాట్రిస్ట్ డా. రవ్వహరి కుమార్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మాకమలాకర్ తెలిపారు. సోమవారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 25న మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ కార్యాలయంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలకు 9390044031 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పుర రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం 6.35 గంటల సమయంలో సుమారు 30 ఏళ్ల వయస్సుగల యువకుడు రైలు కిందపడడంతో శరీరం రెండు ముక్కలయింది. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

వ్యక్తి అదృశ్యం


సంపత్‌కుమార్

కవాడిగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట్ సీసీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌరి సంపత్‌కుమార్(33), ఉమాదేవి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. సంపత్‌కుమార్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో పిల్లలతో ఇంట్లోనే ఉన్నాడు. భార్య ఉమాదేవి పనికి వెళ్లి రాత్రి 7 గంటలకు ఇంటికి రాగా అతడు కనిపించలేదు. సంపత్‌కుమార్ ఆచూకీ లభించకపోవడంతో భార్య ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి రైలు ఎక్కలేదని

కిందకు దూకిన విద్యార్థినికి గాయాలు

బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): తండ్రి రైలు ఎక్కలేదని కంగారుపడి కిందకు దూకిన విద్యార్థిని గాయపడింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గులకుంటలో నివసిస్తున్న రమేష్ కుమార్తె గువ్వ విజయ(14) 7వ తరగతి చదువుతోంది. సోమవారం లింగంపల్లి వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. ఎంఎంటీఎస్ రైలు ఎక్కారు. తండ్రి కనిపించకపోవడంతో కంగారుపడిన విజయ కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడింది. పోలీసులు గాయపడిన ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరగల్లు శిల్పాలను పరిరక్షించాలి

- డాక్టర్ ఎస్. చెల్లప్ప

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో వీరగల్లు శిల్పాలను పరిరక్షిస్తున్నట్టుగానే రాష్ట్రంలో కూడా వాటిని పరిరక్షించాలని డాక్టర్ ఎస్.చెల్లప్ప అన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ బీవీ భద్రగిరీష్ అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ రాసిన త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు (గణపతిదేవుని సంభాషణ-రుద్రమకీల్గుంటి) పుస్తకావిష్కరణ జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.విజయబాబు మాట్లాడుతూ.. త్రిపురాంతకంలో ఎన్నో శిల్పాలు ఉన్నాయని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు మన చరిత్రను యూరోపియన్లు వారి దృక్పథంతో రాశారని, వారి గొప్పతనం గురించి అందులో పొందుపర్చారని అన్నారు. తెలంగాణ చరిత్రను మరచిపోయే విధంగా అప్పటి పాలకులు చేశారని అన్నారు.

దక్కన్ హెరిటేజ్ అకాడమీ వ్యవస్థాపకుడు వేదకుమార్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని నడిపిస్తున్న దేశాలకన్నా మన దేశానికి ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. ప్రతి గ్రామం ఒక మ్యూజియమేనని అన్నారు. చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చి భావితరాలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వారసత్వ శాఖ మాజీ ఉప సంచాలకుడు సముద్రాల శ్రీరంగాచార్య, కవి, చరిత్రకారుడు తురిమెల్ల శ్రీనివాస్ ప్రసాద్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్లు కట్టా శ్రీనివాస్, మురళీకృష్ణ, ప్రతినిధులు వేణుగోపాల్, ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో చారిత్రక శిల్పాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ విశ్రాంత అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప, డాక్టర్ కె.విజయబాబు, మణికొండ వేదకుమార్ తదితరులు